
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజలకోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల -పెద్దపల్లి
మంగళవారం, ఏప్రిల్ 16, 2024 పేజీలు : 07

# వెలిచాలకే టికెట్ కన్ఫామ్

- చక్రం తిప్పిన మంత్రి పొన్నం
- కరీంనగర్ టికెట్ ప్రకటించిన కె సి వేణుగోపాల్
- రాజేందర్ రావు కు కలిసి వచ్చిన వెలమ సామాజిక వర్గం
- గెలిపించి రాహుల్ కు గిఫ్ట్ గా ఇస్తామని అధిష్టానానికి హామీ
- కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు
- రాష్ట్ర రాజకీయ సమీకరణాలతో అలిగిరెడ్డికి భంగపాటు

కరీంనగర్ బ్యూరో (ప్రజాజ్యోతి ): కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్ రావు పేరు ను అధిష్టానం అధికారికంగా ప్రకటించింది. హైదరాబాదులో ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కెసి వేణుగోపాల్ కరీంనగర్, ఖమ్మం, హైదరాబాద్ పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. రాష్ట్ర రాజకీయ సమీకరణాల నేపథ్యంలో టికెట్ ప్రకటనలో జాప్యం జరగడంతో ఇన్ని రోజులుగా కాంగ్రెస్ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఎట్టకేలకు వెలిచాల రాజేందర్ రావు క్యాండిడేట్ గా ప్రకటించి సస్పెన్స్ కు తెరదించింది. కరీంనగర్ టికెట్ కేటాయింపులో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధిష్టానం వద్ద చక్రం తిప్పి తన పంతం నెగ్గించుకున్నారు. కరీంనగర్ లో కాంగ్రెస్ జెండా ఎగరవేసి రాహుల్ గాంధీకి గిఫ్ట్ గా ఇస్తామని అధిష్టానానికి తెలిపినట్లు తెలుస్తోంది. వెలిచాలకు టికెట్ కేటాయిస్తే పార్లమెంట్ సెగ్మెంట్ లోని నలుగురు ఎమ్మెల్యేలతో పాటు ముగ్గురు నియోజకవర్గ ఇన్చార్జిలము గెలిపించే బాధ్యత తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో హుస్నాబాద్ టికెట్ పొన్నం ప్రభాకర్ కు కేటాయించిన విషయం విధితమే. అయితే ఆ సమయంలో అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి తన టికెట్ ను ప్రభాకర్ కు త్యాగం చేయాల్సి వచ్చింది. ఆ సమయంలో ప్రవీణ్ రెడ్డికి ఎమ్మెల్సీ లేదా ఎంపీ టికెట్ కేటాయిస్తామని అధిష్టానం స్పష్టమైన హామీ ఇచ్చింది. అందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి వైపు మొగ్గు చూపారు. అయితే రాష్ట్ర రాజకీయ సమీకరణాల నేపథ్యంలో రెడ్డి సామాజిక వర్గానికి టికెట్ కేటాయించడం సాధ్యం కాలేదు. దీంతో అలిగిరెడ్డికి మరోసారి శృంగభంగం తప్పలేదు. వెలిచాలకు టికెట్ కేటాయించడంతో పార్లమెంటు పరిధిలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకుంటున్నారు.



## అపర భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం

- పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్న జిల్లా కలెక్టర్...
- కల్యాణానికి హాజరయ్యే భక్తులకు అన్నదానం, మజ్జిగ పంపిణీ...
- భక్తులకు ప్రత్యేక ఆర్టీసీ బస్ సౌకర్యం...
- పార్కింగ్ కి పకడ్బందీగా ఏర్పాటు
- పోలీసులతో భారీ బందోబస్తు...
- ఆలయ కార్య నిర్వహణ అధికారి.. సుధాకర్

5లో..





## నామినేషన్ల స్వీకరణకు పకడ్బంది ఏర్పాట్లు

- పెద్దపల్లి పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్
- ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ
- నామినేషన్ దాఖలు సందర్భంగా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లి ప్రతినిధి ,(ప్రజాజ్యోతి), ఏప్రిల్ –15:నామినేషన్ల ప్రక్రియను సక్రమంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు పకడ్బందీగా తీసుకోవాలని పెద్దపల్లి పార్లమెంట్ నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం పెద్దపల్లి పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్ లు జే.అరుణశ్రీ, జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ లతో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నామినేషన్ స్వీకరణ ప్రక్రియకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ,లోక్ సభ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 వరకు జరుగుతుందని, సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో మిగతా 2లో..

## ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- అన్ని ఏర్పాట్లు చేపట్టాలి
- సెల్ఫోన్లను అనుమతించ వద్దు
- నిబంధనలు కచ్చితంగా పాటించాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- పరీక్షల నిర్వహణపై సమన్వయ సమావేశం



ప్రజాజ్యోతి కరీంనగర్ బ్యూరో: ఏప్రిల్ 25వ తేదీ నుంచి మే రెండు వరకు జరుగనున్న ఓపెన్ స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మిగతా 2లో..

## పాఠశాల అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి
- 20 శాతం నిధులు ముందస్తుగా మంజూరు
- సిరిసిల్ల, వేములవాడలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల పరిశీలన



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 15, (ప్రజాజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టే అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ అనురాగ జయంతి వేములవాడ, సిరిసిల్ల పట్టణ పరిధి లోని ప్రభుత్వ పాఠశాలలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టే అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మిగతా 2లో..

# నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు

మొదటిపేజీ తరువాయి...

ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని అన్నారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో పరిశీలించాల్సిన పత్రాలు, అభ్యర్థులకు అందించాల్సిన సూచనలు, ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు, తదితర అంశాలను కలెక్టర్ అధికారులకు వివరించారు. లోక్ సభ ఎన్నికలలో పోటీ చేయబోయే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడానికి ఒకరోజు ముందు ప్రత్యేకమైన బ్యాంకు ఖాతా ప్రారంభించాలని, స్క్రుటిని ప్రారంభం కంటే ముందే అఫిడవిట్ కరెక్షన్స్, డిపాజిట్ సొమ్ము, కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని, స్క్రూటినీ కంటే ఒకరోజు ముందే అభ్యర్థి ప్రతిజ్ఞ తీసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ ఫారం 2ఏ, అఫిడవిట్ సమర్పించాల్సి ఉంటుందని అన్నారు. అభ్యర్థుల ప్రతిపాదకులు తప్పనిసరిగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఓటర్లుగా ఉండాలని, అభ్యర్థి వయసు, కులం



వివరాలు నామినేషన్ పేపర్ పై నమోదు చేయాలని, రాజకీయ పార్టీల తరపున నమోదు చేసే అభ్యర్థులు వారి డిక్లరేషన్ ఫారం సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థి అఫిడవిట్ ఫారం 26 లో పార్టీ పేరు, పార్లమెంటరీ నియోజకవర్గం పేరు, రాష్ట్రం పేరు, ఓటరు జాబితాలో పార్ట్, క్రమ సంఖ్య వివరాలు, పెండింగ్ క్రిమినల్ కేసులు వివరాలు, ఆస్తులు వివరాలు, అప్పుల వివరాలు,వృత్తి, విద్యార్హతలు, మొదలగు అన్ని వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని అన్నారు. అభ్యర్థి దాఖలు చేసిన అఫిడవిట్లో ప్రతి పేజీ పై అభ్యర్థి సంతకం చేసి ఉండాలని, అఫిడవిట్ నోటరీ చేయాలని లేదా కమీషనర్/ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు ప్రమాణం చేయాలని, అభ్యర్థి ఫోటో సాఫ్ట్ కాపీ, హార్డ్ కాపీ తీసుకోవాలని అన్నారు. నామినేషన్ తీసుకున్న తర్వాత రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి అఫిడవిట్ లో అన్ని కాలంలు నింపి ఉన్నాయా, ధృవీకరించిన ఓటరు జాబితా కాపీ (అభ్యర్థి ఇతర నియోజకవర్గ ఓటర్), ఫారం ఏ, ఫారం బీ , కుల ధ్రువీకరణ పత్రం , డిపాజిట్, ప్రతిజ్ఞ అంశాలను పరిశీలించి చెక్ లిస్ట్ జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు వీలుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద సహాయ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు, ఎటువంటి ఇబ్బందులు రాకుండా కట్టుదిట్టంగా నామినేషన్ ప్రక్రియ సక్రమంగా జరగాలని, నామినేషన్ ప్రక్రియ లో పని చేస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అంశాన్ని శ్రద్ధతో పరిశీలించాలని, నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. ఈ సమావేశంలో తహసిల్దార్ లు, కలెక్టరేట్ ఏ.ఓ. శ్రీనివాస్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, ఈ.డి.ఎం. కవిత, రెవెన్యూ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మొదటిపేజీ తరువాయి..

చేపట్టాల్సిన ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లోకి సెల్ఫోన్లను ఎట్టి పరిస్థితిల్లోనూ అనుమతించవద్దని పేర్కొన్నారు. పరీక్ష రాసే వారితోపాటు ఇన్విజిలేటర్లు సెల్ఫోన్లు తీసుకెళ్లకుండా చూడాలన్నారు. నిబంధనలను అందరూ పాటించాలని పేర్కొన్నారు. పోలీసులు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఓపెన్ స్కూల్ ఎస్ఎస్ సీకి సంబంధించిన పరీక్ష కేంద్రాలు కరీంనగర్లో రెండు, హుజురాబాద్ లో ఒకటి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ మూడు కేంద్రాల్లో 475 మంది పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. అదే విధంగా ఇంటర్ కు సంబంధించిన పరీక్ష కేంద్రాలు కరీంనగర్ లో మూడు, హుజురాబాద్ లో రెండు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందులో 881 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని చెప్పారు. పరీక్షలు సజావుగా జరిగేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. బస్సుల సౌకర్యం కల్పించాలని, దీంతో పాటు విద్యుత్ కు అంతరాయం కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా ఎండాకాలం నేపథ్యంలో వైద్య సిబ్బంది మందులను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు సజావుగా సాగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రశ్న పత్రాలు, జవాబు పత్రాలు తీసుకెళ్లే సమయంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నిర్లక్ష్యంగా మాత్రం వ్యవహరించవద్దని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్ఓ పవన్ కుమార్, జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, డీఈసీ మెంబర్ అశోక్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై లక్ష్మారెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక వార్షికోత్సవాలు

**అగ్ని ప్రమాదాల పై అవగాహన కార్యక్రమం**



సిరిసిల్ల టౌన్: ఏప్రిల్ 15(ప్రజా జ్యోతి) తెలంగాణ రాష్ట్ర అగ్నిమాపక శాఖ నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా, సోమవారం రాజన్న సిరిసిల్ల, అగ్నిమపక కేంద్ర సిబ్బంది సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, బస్టాండ్ పరిసరాల్లో అగ్ని ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవకాహన కల్పించారు. ఇందులో భాగంగా ఇంచార్జి కేంద్రాధికారి టీ.నరసింహాచారి మాట్లాడుతూ.ఈ నెల ఏప్రిల్ 14 నుండి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పలు అవగాహణ కార్యక్రమాలు నిర్వహస్తున్నామని, ప్రజలందరు అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మాన్ మహిపాల్, డ్రైవర్ ఆపరేటర్ నవీన్ కుమార్, ఫైర్ మాన్లు సాగర్ రెడ్డి, నాగరాజ్, ప్రవీణ్ కుమార్, ఎస్డి సాబీర్, రాజు లు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి

మొదటిపేజీ తరువాయి..

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీటి సౌకర్యం, తరగతి గదుల మైనర్, మేజర్ మరమ్మత్తులు, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లను ఉపయోగంలోకి తీసుకురావడం, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదికి విద్యుత్ సౌకర్యం కల్పన వంటి మౌలిక వసతులు అమ్మ పాఠశాల కమిటీల ద్వారా జూన్ 10 వరకు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలకు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేయాల్సిన మరమ్మత్తు పనులు అదనపు తరగతుల నిర్మాణం టాయిలెట్స్, మొదలగు అభివృద్ధి పనుల ప్రతిపాదనలను కలెక్టర్ పరిశీలించి, ప్రాధాన్యత ప్రకారం పనులు వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టే



పనులకు నిధులు ఎప్పటికప్పుడు చెల్లించడం జరుగుతుందని, అభివృద్ధి పనుల ప్రతిపాదనలో 20 శాతం మేర నిధులు పనులు ప్రారంభించిన వెంటనే మంజూరు చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డిఈఓ రమేష్ కుమార్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అవినాష్, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరపై కొనుగోలు

**అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్**

**కోతలు లేకుండా రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి**



పెద్దపల్లి ప్రతినిధి ,(ప్రజాజ్యోతి) ఏప్రిల్ -15: నాణ్యమైన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో మద్దతు ధరపై కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో యాసంగి 2023-24 ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, నాణ్యమైన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో మద్దతు ధరపై రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో భారత ఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను తూచ తప్పకుండా పాటించాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రైస్ మిల్లర్లు ఎటువంటి కోత లేకుండా ధాన్యం దిగుమతి చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కే.రవీందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకు కృషి చేయాలి

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**కాంగ్రెస్ పార్టీలో నూకలమర్రి వాసుల చేరికలు**

వేములవాడ, ఏప్రిల్ 15, (ప్రజాజ్యోతి): వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామం నుండి బిఆర్ఎస్ మండల నాయకులు, ఏసుక్రీస్తు శిష్య బృందం సభ్యులు, యాదవ సంఘం సభ్యులు, రజక సంఘం సభ్యులు సోమవారం భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కండువా కప్పి, కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అందిస్తున్నా సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయలన్నారు..రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. పేద ప్రజలకు,ఎస్సీ,ఎస్టీ,బీసీ లకు సంక్షేమ పథకాలు కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ద్వారానే సాధ్యం అన్నారు. గత పది సంవత్సరాల బిఆర్ఎస్,బీజేపీ ప్రభుత్వల వలన కేంద్ర,రాష్ట్రలకు ఒరిగింది ఏమి లేదన్నారు. కేవలం కాంగ్రెస్ పార్టీ ద్వారానే రాష్ట్రంలో, దేశంలో పేద బడుగు బలహీన వర్గాలకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. దేశంలో,రాష్ట్రంలో పేద ప్రజలకు కేవలం కాంగ్రెస్ పార్టీ ద్వారానే అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు సాధ్యమని ప్రజలు భావిస్తున్నారని అన్నారు.అందుకే తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ప్రజా పాలనకు స్వీకారం చుట్టారని దేశంలో కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పేరుతో అధికారంలోకి వచ్చిన గత పాలకులు తెలంగాణ పదాన్ని దూరం చేసుకున్న నాడే ప్రజలతో పేగు బంధం తెగిపోయింది అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నిత్యావసర ధరలు పెంచుతూ సామాన్యులను రోడ్డున పడేస్తుందని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కొత్త పాత అనే తేడా లేకుండా కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్ మండల నాయకులు రొమాల ప్రవీణ్, యాదవ సంఘానికి చెందిన మెడిదల పరుశరాములు,మెడిదల శ్రీనివాస్,పొట్ల మధు,ఏసుక్రీస్తు శిష్య బృందం బస రాజు, రజక సంఘం చెందిన కొత్తకొండ రమేష్, దేవయ్య, హమాలి సంఘానికి చెందిన సుంకపాక శంకరయ్య వారి ఆధ్వర్యంలో సుమారు 200 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేయడం జరిగింది అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.



## సింగరేణి గనుల వాటర్ ద్వారా త్రాగునీటి సరఫరాకు గల అవకాశాలను పరిశీలించాలి

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

పెద్దపల్లి ప్రతినిధి, (ప్రజాజ్యోతి), ఏప్రిల్ -15:సింగరేణి గనుల వాటర్ ద్వారా జిల్లాలో త్రాగునీరు సరఫరా చేసేందుకు గల అవకాశాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ్ శ్రీ తో కలిసి సింగరేణి బొగ్గు గనుల నుంచి పంప్ చేస్తున్న నీటిని త్రాగునీరుగా మలిచి సరఫరా చేసేందుకు గల అవకాశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లాలో ఉన్న



ఆర్జీ 1, ఆర్జి 2 , ఆర్జి 3 గనుల నుంచి ప్రతి రోజూ దాదాపు 132 ఎం.ఎల్.డి నీరు పంపింగ్ చేస్తున్నామని, వీటిలో సింగరేణి అవసరాలకు వినియోగించుకున్న తరువాత దాదాపు 100 ఎం.ఎల్.డి నీటిని వ్యవసాయ నిమిత్తం విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. సింగరేణి ఆర్జి 1 నుంచి నీరు విడుదలయ్యే ఎర్ర చెరువు, నల్ల చెరువు, ఆర్జి 2 నుంచి నీరు విడుదలయ్యే జల్లారం వాగు, ఆర్జి 3 నుంచి నీరు విడుదలయ్యే బోక్కల వాగు నుంచి నీటిని త్రాగునీటి సరఫరా కు మళ్లించేందుకు గల అవకాశాలపై ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సింగరేణి బొగ్గు గనుల నుంచి వచ్చే నీటిని ఆర్వో ప్లాంట్ ద్వారా శుద్ధి చేసి ప్రస్తుతం అందుబాటులో ఉన్న పైప్ లైన్ వ్యవస్థను వినియోగించుకుంటూ రామగుండం పట్టణం, పరిసర గ్రామాలకు త్రాగు నీటి సరఫరా చేసే అంశంపై సాధ్యాసాధ్యాలు గురించి ప్రతిపాదనలు రెండు, మూడు రోజుల్లో సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, ఈఈ మిషన్ భగీరథ గ్రిడ్ పూర్ణ చందర్, ఈఈ మిషన్ భగీరథ ఇంట్రా జి.శ్రీను, సింగరేణి అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలీయుల అభివృద్ధి కి కృషి చేస్తా

**రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



గోదావరిఖని, ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి) : రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పద్మశాలీయుల అభివృద్ధి కి కృషి చేస్తామని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ హామీ ఇచ్చారు.సోమవారం స్థానిక మార్కండేయ కాలనీ లోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పద్మశాలి సంఘం నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ లో చేరారు.రాజ్ ఠాకూర్ హాజరై కండువాలు కప్పి వారిని పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మదాలీయులు ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు.పద్మశాలి కులస్తుల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.సేవా సంఘం పంక్షన్ హల్ పూర్తి నిర్మాణం చేస్తామని , పద్మశాలీ వ్యాపారస్తుల అభివృద్ధి కోసం ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. సోడాలు, పచ్చళ్ళు సంఘం వారి జీవనోపాధి కోసం పథకాలు, ఇండ్లు లేని వారికీ గృహాలను అందిఇస్తామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో పద్మశాలీ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బండారు రాయమల్లు, బూర్ల దామోదర్ తో పాటు టిడిపి, బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు అనుమ రాజమల్లు, గుండేటి శంకర్, సిరిమల్ల జయరాములు, సిరిపురం మాణిక్యం, తాటికొండ రవీందర్, కానుగంటి నారాయణ, కన్నం ప్రభాకర్ ఉన్నారు. పద్మశాలి సేవా సంఘం ఉపాధ్యక్షులు గుండేటి రాజేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో పద్మశాలీ సేవా అధ్యక్ష, కార్యదర్శులు బండారి రాజమల్లు, బూర్ల దామోదర్, పొపా అధ్యక్షులు వద్దేపల్లి దినేష్ , మహిళా సంఘం మాటేటి మౌనిక, యువజన సంఘం మాటేటి సతీష్, వేణు, నాయకులు వెంగల బాపు, దాసరి ఉమ, సాంబమూర్తి, కాంగ్రెస్ కార్పొరేటర్లు కొలిపాక సుజాత, మహంకాళి స్వామి, బొంతల రాజేష్, ముస్తఫా, నాయకులు పాతిపల్లి ఎల్లయ్య, ప్రకాష్, తిప్పారపు శ్రీనివాస్, గట్ల రమేష్, అనుమ సత్యనారాయణ, ఆడేపు రవి, దేవేనపల్లి చక్రపాణి పాల్గొన్నారు.

## మహిళా గుమస్తా కుటుంబానికి ఫోటో గ్రాఫర్స్ చేయూత

**రూ.లక్షా యాభై వేల ఆర్థిక సాయం**



గోదావరిఖని, ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి) : గోదావరిఖని మాత కలర్ ల్యాబ్ లో గుమస్తా గా పనిచేస్తూ ఇటీవలే మృతి చెందిన సోఫియా బేగం కుటుంబానికి ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్థిక చేయూతనందించింది.ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం కుటుంబ భరోసా నుంచి రూ.1,60,000 చెక్కును సోఫియా కుటుంబ సభ్యులకు పెద్దపెల్లి జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డి భాస్కర్, తెలంగాణ రాష్ట్ర మహిళా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దమ్మాల తులసి అందజేశారు.అధ్యక్షులు హుస్సేన్, ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి శైలేందర్ ,కుటుంబ భరోసా ఇంచార్జ్ బోలుగూరి నాగరాజు కు సోఫియా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గోదావరిఖని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శనిగరపు మల్లేష్, కోశాధికారి బండారి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోగుల విజయ్, జిల్లా కోశాధికారి వనపర్తి శ్రీనివాస్,ఉపాధ్యక్షులు దుస్స మహేష్, తోగటి శ్రీధర్, రామగిరి శ్రీనివాస్ సంయుక్త కార్యదర్శి కోడి రామకృష్ణ, రెడ్డి శ్యాం ప్రసాద్, మోర విక్రమ్, మాత కలర్ ల్యాబ్ యాజమాన్యం శేఖర్, రాకేష్, అజయ్,నవీన్ పాల్గొన్నారు.

# శ్రీ భక్తాంజనేయ రుక్మిణి విఠలేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు

సిరిసిల్ల, ఏప్రిల్ 15, (ప్రజాజ్యోతి): సిరిసిల్లలోని గాంధీనగర్ లో గల శ్రీ భక్తాంజనేయ రుక్మిణి విఠలేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీ కాళభైరవ స్వామి ప్రతిష్ఠ, గోపుర కలశ పూజ కొరకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులు, శ్రీ మధుసూదనానంద సరస్వతీ స్వామి శ్రీక్షేత్రం నాచారంగుట్ట వారి ఆశీస్సులతో శ్రీశుకానంద నాథ దీక్షానామాంకిత బ్రహ్మశ్రీ రాచర్ల రఘురామ శర్మ ఆధ్వర్యంలో గర్తన్యాసం, యంత్ర ప్రతిష్ఠ వైభవముగా నిర్వహించారు. ఆలయంలోని వినాయకుడు, శివుడు, అమ్మవారి వెండి కవచములు అలంకరించారు. శ్రీ కాలభైరవ స్వామి వారి యంత్ర ప్రతిష్ఠా విగ్రహ ప్రతిష్ఠ ను శ్రీ కాల భైరవస్వామి విగ్రహాదాత కాలభైరవ గురుసంస్థాన్ మఠం, రాజమహేంద్రవరం, ఆంధ్రప్రదేశ్ వారి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, నేత్రోన్మాలనం, మహాబలి నివేదన, శ్రీ భక్తాంజనేయ రుక్మిణి విఠలేశ్వర స్వామి దేవాలయ గోపురం (కలశ పూజ)



కార్యక్రమములు వైభవముగా నిర్వహించారు. దీప స్థంభ స్థాపన పూర్ణాహుతి, కుంభాభిషేకం, ఆశీర్వాదం, బుత్విక్సన్మానం నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, మాజీ టెక్స్ టైల్స్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, స్థానిక వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ–పూర్ణచందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆడేపు రవీందర్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విఠల్, కౌన్సిలర్లు గడ్డం చందన– భగవాన్, పోచవేని సత్య ఎల్లయ్య, గుండ్లపెల్లి రామానుజం, లింగంపెల్లి సత్యనారాయణ, అడ్డగట్ల మాధవి–మురళి, గుడ్ల శ్రీనివాస్, రాపెల్లి అరుణ–లక్ష్మినారాయణ, గెంట్యాల శ్రీనివాస్, కల్లూరి రాజు, మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్, రాపెల్లి లక్ష్మి దేవదాస్, దార్ల సందీప్, ఆలయ అధ్యక్షులు వడ్లకొండ ఆనందం, కార్యదర్శి కుడిక్యాల శంకర్, ఉపాధ్యక్షులు కొడం అమర్నాథ్, సహాయ కార్యదర్శి పత్తిపాక వేణుగోపాల్, కోశాధికారి కొమాకుల ఆంజనేయులు, యేముల నారాయణ, కొడం నారాయణ, తడుక విశ్వనాథం, స్వర్గం ప్రసాద్, అంకారపు కృష్ణహరి, గుండ్లపెల్లి శ్రీనివాస్, మంగళారపు ప్రభాకర్, ఆలయ కార్యవర్గ సభ్యులు అంకారపు జ్ఞానోభ, రాపెల్లి సంతోష్, మ్యాన రాంప్రసాద్, నల్ల ప్రదీప్, వావిలాల ఆనందం, గెంట్యాల గోపి, శ్రీపతి పరుశురాం, పంతం రవి, అన్నల్ దాస్ రాకేశ్, ముదిగంటి వేణు, వంగరి గోపి, పులి అనిల్, భక్తులు పాల్గొన్నారు.

# ప్రారంభం కాని ధాన్యం కొనుగోలు



**కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు**

**ఆందోళనలో రైతులు**

మంథని, ఏప్రిల్ 16 (ప్రజాజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల బాధ్యుల నియామకంలో తాత్సారం వల్ల ధాన్యం కొనుగోలు నిలిచిపోయింది.ఇన్చార్జిల నియామకంలో కాంగ్రెస్ నాయకుల ఆధిపత్య పోరుకు రైతులు బలి కావలసిన పరిస్థితులు నెలకొన్నాయి. తాము సూచించిన వారినే ఇన్చార్జిలుగా నియమించాలని గ్రామాల్లో ఆధిపత్యపరు సాగుతోంది. ఈ విషయంలో మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎటు తేల్చుకోలేక పోతున్నాడని సమాచారం. కాంగ్రెస్ పార్టీ నాయకుల చర్యల వల్ల కల్లాల్లో ధాన్యం పోసిన రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నది.వర్షం పడితే బాధ్యులు ఎవరు బాధ్యులని రైతులు ప్రశ్నిస్తున్నారు. మంథని మండల పరిధిలో వెసంగి వరి కోతలు ముమ్మరయి పది రోజులు దాటిపోయింది.గత పది రోజుల నుంచి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరుతోంది. ఇప్పటికే ధాన్యం కుప్పలు తెప్పలుగా వచ్చి చేరింది. రైతులు కల్లాల్లో ఆరబోసి కాంట కోసం ఎదురుచూస్తున్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటు కూడా ఇప్పటి వరకు జరగలేదు.కల్లాలకు రావలసిన బార్దాన్ ,సుతిలి, కాంటాలు ఇప్పటికీ కల్లాలకు చేరలేదు. ప్రభుత్వం మారిన క్రమంలో ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాల నిర్వహకుల నియామకం జరగలేదు. దీంతో కల్లాల నిర్వహణ ప్రశ్నార్థకంగా తయారయింది. కొనుగోలు కేంద్రాలకు ఇప్పటివరకు గన్ని సంచులు చేరలేదంటే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అకాల,వడగండ్ల వర్షాలు వచ్చి ధాన్యం తడిసిపోతే తమ పరిస్థితి ఏంటని, దానికి బాధ్యులు ఎవరు అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా లారీల సమస్య మరో విధంగా ఉంది.బార్ధాన్, కాంటాలు చేరవేసే లారీలు ఇంతకుముందు మిల్లర్లు చేరవేసేవారు. ప్రస్తుతం మంథనిలో లారీ అసోసియేషన్ ఏర్పాటు కావడం ధాన్యం చేరవేసేందుకు తమ లారీలనే వినియోగించాలని అసోసియేషన్ మొండికేసి కూర్చుంది. ఈ పీట ముడిని విప్పే బాధ్యత సివిల్ సప్లై, పిఏసిఎస్ వారిపై ఉండగా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. దీంతో సుమారు మండలంలోని 38 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం నిలిచిపోయింది. దీనిని ఆసరాగా చేసుకుని ప్రైవేటు ధాన్యం వ్యాపారులు నేరుగా పొలాల వద్దకే వెళ్లి క్వింటాలుకు రూ. 1600 చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. ధాన్యం కొనుగోలు లో ఎలాంటి ఇబ్బందులు రా వద్దని జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించిన అధికారుల్లో ఎలాంటి మార్పు రాలేదు.



## ఘనంగా పెద్దమ్మ-పెద్ధి రాజుల కళ్యాణ మహోత్సవం

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు**

వేములవాడ, ఏప్రిల్ 15, (ప్రజాజ్యోతి): వేములవాడ రూరల్ మండలం ఫాజుల్ నగర్ గ్రామంలోని శ్రీ పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. స్వామినివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి దివ్య ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని వేడుకున్నారు. అనంతరం ముదిరాజ్ సంఘ సభ్యులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఖని లో 18న జిల్లా సదస్సు

**డిహెచ్పిఎస్ రాష్ట్ర సమితి సభ్యులు దినేష్**

గోదావరిఖని, ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి)గోదావరిఖని గంగానగర్ స్వాగత్ ఫంక్షన్ హాల్ లో డిహెచ్పిఎస్ రామగుండం నగర సమితి ఆధ్వర్యంలో ఈ నెల 18న ఉదయం 10 గంటలకు 2024 పార్లమెంట్ ఎన్నికలు – సామాజిక శక్తుల కర్తవ్యం అనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు సమితి రాష్ట్ర సమితి సభ్యులు మద్దెల దినేష్ తెలిపారు. సోమవారం గోదావరిఖని భాస్కర్ రావ్ భవన్ లో సమితి కార్యకర్తల ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ మే 13న జరిగే తెలంగాణలోని 17 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రానున్న ఐదేళ్లు దేశ ప్రజల భవిష్యత్తు నిర్దేశిస్తాయన్నారు. దళితులు,గిరిజనులు,బలహీన వర్గాలు, మైనార్టీ పేదలందరికీ రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్యం సామాజిక న్యాయం, ఫెడరలిజం, లౌకికతత్వం వంటి రాజ్యాంగ మూల స్తంభాలు మిగిలి ఉంటాయా లేదా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద శక్తులకు కాకుండా లౌకిక శక్తులకు ఓట్లు వేయాలన్నారు.దేశంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి




వచ్చాక ప్రజాస్వామ్యాన్ని లూటీ చేస్తూ దేశ సంపదను పూర్తిగా కార్పోరేట్ శక్తులకు దారా దత్తం చేస్తుందని ఆరోపించారు. 10 ఏళ్ల అధికారంలో కేవలం అట్టడుగు బలహీన వర్గాలు, దళితులు, మహిళలపై తీవ్రస్థాయిలో దాడులు, దౌర్జన్యాలు జరిగాయన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో 300 రెట్లు దళితులపై దాడులు పెరిగాయని విమర్శించారు.బిజెపి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేసే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో మనువాదం, మతోన్మాద శక్తులను ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు కందుకూరి రాజారత్నం, ఎర్రల రాజయ్య, శనిగరపు చంద్రశేఖర్, రాజేశ్వర్ రావ్ పాల్గొన్నారు.

# శ్రీ సీతారామ కళ్యాణంకు పట్టుచీర నేసిన నేతన్న



సిరిసిల్ల, ఏప్రిల్ 15, (ప్రజాజ్యోతి): రాజన్న సిరిసిల్లకు చేనేత కార్మికుడు వెల్ది హరిప్రసాద్ రెండు గ్రాముల బంగారం, 150 గ్రాముల వెండి పట్టుదారాలతో పట్టు చీరను రూపొందించాడు. ఈ పట్టుచీర కొంగులో సీతారాముల కళ్యాణం బొమ్మనేయడం విశేషం. ఈ సందర్భంగా వెల్ది హరిప్రసాద్ మాట్లాడుతూ శ్రీ సీతారాముల కళ్యాణంకు సిరిసిల్ల నుండి ప్రతి సంవత్సరం ఆనవాయితీగా వస్తుందని, అందులో భాగంగా చేనేత మగ్గంపై సీత రాముల కళ్యాణం ప్రతిరూపం, అంచులో భద్రాద్రి దేవాయాయం, సీతారాముల ప్రతిరూపాలు, శంకు చక్ర నామాలు, జైశ్రీరామ్ పేర్లతో ఆరు రోజుల పాటు శ్రమించి, ఈ చీరను చేనేత మగ్గంపై నేశానని తెలిపారు. ఈ చీర యొక్క బరువు 800 గ్రాములు ఉంటుందని, దీన్ని దేవాదాయ శాఖ మంత్రికి చూపించి, సీతారాముల కళ్యాణంకు అందిస్తానని తెలిపాడు.



## అంగన్వాడి కేంద్రాలలో వార్షికోత్సవ వేడుకలు

వేములవాడ, ఏప్రిల్ 15, (ప్రజాజ్యోతి): వేములవాడ పట్టణంలో ఐసిడిఎస్ సీడీపీఓ ఎల్లయ్య ఆదేశాల మేరకు మహాలక్ష్మివీధి ఎస్సీ కాలనీ, మహాలక్ష్మి వీధి అంగన్వాడి కేంద్రాలలో సోమవారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సూపర్వైజర్ కనకమ్మ, అంగన్వాడి టీచర్లు కృష్ణకుమారి సరోజన యాక్టివిటీస్ ప్రోగ్రాం చేయించి, ప్రీ స్కూల్ పై తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలింతలు, గర్భిణీలు మహిళలు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 26 లోగా పుస్తక విక్రేతలు దరఖాస్తులు సమర్పించాలి : డి.ఈ.ఓ. డి.మాధవి

పెద్దపల్లి ప్రతినిధి ,(ప్రజాజ్యోతి), ఏప్రిల్ -15: జిల్లాలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అన్ని మీడియముల ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు విక్రయించుటకు ఆసక్తి గల విక్రేతలు ఏప్రిల్ 26 లోగా దరఖాస్తు సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.పాఠశాల విద్యా సంచాలకుల ఆదేశాల ప్రకారం 2024-25 విద్యా సంవత్సరంలో అన్ని మీడియంలలో ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు విక్రయించుటకు ఆసక్తి గల విక్రేతలు తమ దరఖాస్తుతో పాటు వెయ్యి రూపాయల డిడి జిల్లా విద్యాశాఖ అధికారి, పెద్దపల్లి పేరున తీసి ఏప్రిల్ 26లోగా సమర్పించి అనుమతి పొందాలని అన్నారు. అనుమతి లేకుండా ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డి.ఈ.ఓ. మాధవి ఆ ప్రకటనలో తెలిపారు.

## వడదెబ్బ నుండి ఎలా రక్షించుకోవడం పట్ల కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేసిన మున్సిపల్ అధికారులు



మెట్ పల్లి ప్రతినిధి ఏప్రిల్ 15 ( ప్రజా జ్యోతి) : తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జగిత్యాల జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా ఆదేశాలతో వడదెబ్బ తగలకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని వడదెబ్బ నుండి ఎలా రక్షించుకోవడం పట్ల పలు అంశాలపై కరపత్రాలను మున్సిపల్ అధికారులు ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ టి మోహన్ మాట్లాడుతూ వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. వడదెబ్బ తగలకుండా ఉండటానికి చేయవలసిన పనులు సరిపడా నీరు త్రాగడం, సూర్య రష్మీ నేరుగా పడకుండా జాగ్రత్త వహించడం, మధ్యాహ్నం 12 గంటల నుండి నాలుగు గంటల వరకు ఇంటిలోనూ ఉండడం చేయాలన్నారు, మధ్యాహ్నం 12 గంటల నుండి నాలుగు గంటల వరకు బయటకు వెళ్ళకూడదన్నారు, ఎండలో పనిచేయడం, ఆటలాడడం, ఆల్కహాల్ టీ, కాఫీ, స్వీట్స్, చల్లని డ్రింక్స్ తీసుకోవడం, చెప్పులు వేసుకోకుండా బయట తిరగడం మంచిది కాదన్నారు., మధ్యాహ్నం పూట నిలిపి ఉన్న వాహనాలలో పిల్లలను, పెంపుడు జంతువులను ఎక్కించ వద్దన్నారు.ఈకార్యక్రమంలో ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ గుర్రం రత్నాకర్, ముజీబ్,లతో పాటు పలు వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

# బిజెపి బీఆర్ఎస్ రెండు పార్టీలు దొందు... దొందే..



రుద్రంగి ఏప్రిల్ 15 ప్రజా జ్యోతి : కేంద్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు దేశ ప్రజలు సిద్ధమయ్యారని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం రుద్రంగి మండల జడ్పిటిసి గట్ల మీనయ్య, రుద్రంగి మాజీ సర్పంచ్ సావణపల్లి నారాయణ, పాల నర్సయ్య, కొమిరె ప్రశాంత్, ధర్నా రెడ్డి, తోపాటు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేయడం జరిగింది అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా తామంతా పనిచేస్తామన్నారు. 10 సంవత్సరాల బిఆర్ఎస్, బిజెపి పాలనలో రాష్ట్రానికి దేశానికి ఒరిగిందేమీ లేదన్నారు. పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలన్నా బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగాలన్న కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తోనే సాధ్యమన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా జీవితంలో ఉంటూ ప్రజా సేవ చేస్తున్న ఇతర పార్టీలో నుండి నేడు కాంగ్రెస్ పార్టీలోకి రావడానికి స్వాగతిస్తున్నానన్నారు. నేటి నుండి వారు కాంగ్రెస్ పార్టీ కుటుంబంలో సభ్యులుగా ఉంటారని అన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పార్టీ నాయకులకు కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రుద్రంగి మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి అత్యధిక మెజారిటీ వచ్చే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, మణిపూర్ నుంచి ముంబై వరకు సుమారు పదివేల కిలో మీటర్లు పాదయాత్ర చేసిన సందర్భంలో రాహుల్ గాంధీకి ప్రజల నుండి వచ్చిన వినతులు సమస్యల పరిష్కారానికి రూపొందించి కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల చేయడం జరిగిందన్నారు. కేంద్రంలో మళ్లీ బిజెపి అధికారంలోకి రావడానికి మత రాజకీయాలను చేయడం దురదృష్టకరమన్నారు. గతంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి నరేంద్ర మోడీ అనేక అబద్ధ హామీలు ఇచ్చారని జన్ ధన్ ఖాతాలో ధన్ ధన్ మనీ 15 లక్షలు వేస్తామని చెప్పి ప్రజలను మోడీ ప్రభుత్వం దేశ ప్రజలను మోసం చేశారన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను చదువుకున్న విద్యార్థులను అబద్ధపు హామీలతో మోసం చేశారన్నారు. మన్మోహన్ సింగ్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం లో పెట్రోల్ డీజిల్ రేట్లు ఎక్కువ ఉన్నాయని ధర్నాలు, రాస్తారోకోలు చేసి బిజెపి నాయకులు నేడు క్రూడ్ ఆయిల్ ధర తక్కువ ఉన్నాగాని పెట్రోల్, డీజిల్ ధరలను 100 రూపాయల పైకి తీసుకువచ్చిన ఘనత బిజెపి ప్రభుత్వానికి చెల్లిందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ధరలు పెంచి సామాన్యులపై పెనుబారం మోపిందన్నారు. కేంద్రంలో బిజెపి చేసిన తప్పుని రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిందని లక్ష ఉద్యోగాలు ఇస్తానని మోసం దుయ్యబట్టారు.రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు ఎలక్షన్ గా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు తూం జలపతి నాయకులు బైరి గంగ మల్లయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, చెలుకల తిరుపతి, తర్రె మనోహర్, కొమిరి శంకర్, కేసిరెడ్డి నర్సరెడ్డి, ఎర్రం గంగ నర్సయ్య, ధర్నా మల్లేశం, పల్లి గంగాధర్, గండి నారాయణ, పిడుగు లచ్చిరెడ్డి, మాడిశెట్టి అభిలాష్, మోతి నర్సయ్య, సనుగుల గంగాధర్, గంధం మనోజ్, తర్రె లింగం, పూదరి మహిపాల్, దయ్యాల శ్రీనివాస్, గుగ్గిళ్ళ వెంకటేశం, అక్కెనపల్లి శ్రీనివాస్, కట్కూరి దాసు, దావాల రవి, మారంపల్లి రాజ్ కుమార్, దువ్వాక గంగాధర్ తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఓబీసీ సెల్ అదనపు బాధ్యులుగా పులి ఆంజనేయులు గౌడ్



కరీంనగర్, ఏప్రిల్ 15, (ప్రజాజ్యోతి): రానున్న లోక్ సభ ఎన్నికలను పురస్కరించుకొని కరీంనగర్ పార్లమెంటు అభ్యర్థి విజయమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు నూతి శ్రీకాంత్ గౌడ్ రాష్ట్రంలోని పార్లమెంట్ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ పక్షాన సమన్వయకర్తలను నియమించారు. ఇందులో భాగంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఓబీసీ సెల్ అదనపు బాధ్యులుగా కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడైన పులి ఆంజనేయులు గౌడ్ ని నియమించారు. ఈ సందర్భంగా పులి ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థితో పాటు కాంగ్రెస్ పార్టీ పునర్నిర్మాణానికి పాటుపడతానని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, నాయకత్వంలో మరింత సమర్ధవంతంగా పనిచేస్తానని, టిఆర్ఎస్ బిజెపి రాక్షస పాలనపై అలు పెరుగని పోరాటం చేస్తానని పులి ఆంజనేయులు పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి, చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యంకి, మానకొండూర్ శాసనసభ్యులు కవ్వంపల్లి డా.కవ్వంపల్లి సత్యనారాయణకి, ఓబీసీ సెల్ పీసీసీ ప్రెసిడెంట్ నూతి శ్రీకాంత్ గౌడ్, వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ కి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డికి, కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి పురుమళ్ళ శ్రీనివాస్ కి, హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జి ప్రణవ్ కి, పులి ఆంజనేయులు గౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు.



## కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి

**కేంద్రాల తనిఖీలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**

సిరిసిల్ల, ఏప్రిల్ 15, (ప్రజాజ్యోతి): రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సూచించారు. తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల, అంకుసాపూర్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సోమవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో వసతులను పరిశీలించి, అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం తంగళ్లపల్లిలోని సప్తగిరి ఇండస్ట్రీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దళారులకు అడ్డుకట్ట వేసేందుకు, రైతులకు మద్దతు ధర అందించేందుకు ఈసారి ముందుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని వెల్లడించారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2203, గ్రేడ్ బీ రకానికి రూ.2183 నిర్ణయించిదని వెల్లడించారు. రైతులు తమ ధాన్యాన్ని శుభ్రంగా తీసుకువచ్చి, మద్దతు ధర పొందాలని తెలిపారు. జిల్లాలోని రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారులకు ధాన్యం విక్రయించవద్దని కోరారు. ఇక్కడ జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కథలాపూర్, ఏప్రిల్ 15(ప్రజాజ్యోతి): కథలాపూర్ మండలం తాండ్రియాల తాజా మాజీ సర్పంచి గడీల గంగప్రసాద్, తుర్తి మాజీ సర్పంచి గంగ భూమయ్య వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం తాండ్రియాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షల ఆధారంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని ఆయన అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలను సంక్షేమ అభివృద్ధి వైపు నడిపించేందుకు కట్టుబడి ఉందన్నారు. ప్రజల మధ్య ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకునే నాయకునికి అవకాశం ఇవ్వాలని, కానీ మతం పేరిట ఓట్లు అడిగే వారికి అవకాశం ఇవ్వొద్దన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలోనే మొదటి ప్రాధాన్యత క్రమంలో మన నియోజకవర్గంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును పెట్టారని త్వరలోనే కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు పూర్తి చేస్తామని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. వారితో పాటు జక్కని ప్రసాద్, చెన్నవేని ప్రకాష్, అల్లూరి జనార్ధన్ రెడ్డి, గడిల గంగరెడ్డి, చాంద్ పాషా, గడిల లక్ష్మణ్, సంగెపు గంగరాజు, నల్ల చిన్నారెడ్డి,అల్లూరి వెంకటరెడ్డి, మహేష్, అశోక్, తుర్తికి చెందిన నరేష్, గణేష్, అశోక్, నవీన్, అజయ్, హరీష్, గంగరాజం, శంకర్ పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు తోట్ల అంజయ్య, మండలాద్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అజీమ్, కాంగ్రెస్ నాయకులు డీసీసీ మెంబర్ చెదలు సత్యనారాయణ, శ్రీహరి, హరిప్రసాద్, కృష్ణచారి, కట్ట శంకర్, భైర మల్లేష్, దేవయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు అరుణ్, వినోద్, ధర్మేందర్, మారుతి తదితరులు పాల్గొన్నారు.



## ఏసిబి వలలో ఆర్టిసి డిపో మేనేజర్

జమ్మికుంట, ఏప్రిల్15( ప్రజా జ్యోతి): హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ 20 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు...అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్కతుర్తి మండలం పరిధిలో సోమవారం రోజున స్థానిక మన్విత హోటల్ లో డబ్బులు తీసుకుంటుండగా ఏసిబికి చిక్కినట్లు తెలిపారు.. హుజూరాబాద్ డిపోకు చెందిన డ్రైవర్ తాడికొండ రవీందర్ కు డిపో మేనేజర్ శ్రీకాంత్ చార్జీ మెమో జారీ చేశారు. ఛార్జీ మెమో ఎత్తేయడానికి హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ 30 వేలు డిమాండ్ చేశాడు.అందులో 10 వేలు ముందుగా ఇచ్చినప్పటికీ మిగతా డబ్బుల కోసం డిమాండ్ చేయగా విసుగు చెందిన డ్రైవర్ రవీందర్ ఏసీబీని ఆశ్రయించాడు. సోమవారం అధికారులు పథకం ప్రకారం డ్రైవర్ తాడికొండ రవీందర్ రూ. 20 వేలు లంచం ఇస్తుండగా హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ ని రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

## కాంగ్రెస్ పాలనలో రైతులు అష్టకష్టాలపాలు

ముస్తాబాద్ ఏప్రిల్ 15(ప్రజాజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ రైతుబంధు అధ్యక్షులు కల్వకుంట్ల గోపాల్ రావు పత్రికా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూకాంగ్రెస్ పాలనలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని అన్నారు.రైతులు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ దేవుడెరుగు కనీసం మద్దతు ధర కూడా లభించడం లేదన్నారు.అసమర్థ కాంగ్రెస్ పాలనలో క్వింటాలుకు రూ.700 వరకు నష్టపోతున్నది రైతన్నలని,ఐకెపి సెంటర్లలో కొత్త బార్దన్ ఉండగా పాత బర్దన్ వేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నరన్నారు.వెంటనే రైతులు పండించిన ధాన్యానికి 500 రూపాయల బోనస్ మరియు కనీస మద్దతు ధర ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి,పట్టణ అధ్యక్షులు ఎద్దండి నర్సింహారెడ్డి,యూత్ అధ్యక్షుడు శీలం స్వామి,బిఆర్ఎస్ పార్టీ నాయకులు తాళ్ల రాజు గుండవేని సతీష్ ,బిఆర్ఎస్వి మండల అధ్యక్షుడు నవాజ్,కంచం నర్సింలు,బిఆర్ఎస్వి యూత్ ప్రశాంత్,గుణశేఖర్,బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### బండి సంజయ్ ని అత్యధిక మెజార్టీతో

## గెలిపించాలని బిజెపి నాయకుల ప్రచారం

ముస్తాబాద్ ఏప్రిల్ 15(ప్రజాజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని చీకోడు గ్రామంలో భూత్ అధ్యక్షులు ఊరడి రాజు ఆధ్వర్యంలో మండల ప్రధాన కార్యదర్శి బాద నరేష్ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడపగడపకు ప్రజలకు వివరిస్తూ బిజెపి కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్ ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బాద నరేష్, బూత్ అధ్యక్షులు ఊరడి రాజు,పిట్ల ఎల్లం మరియు మహిళలు,ప్రజలు పాల్గొన్నారు.



# అపర భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం

- ప ట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్న జిల్లా కలెక్టర్
- కళ్యాణానికి హాజరయ్యె భక్తులకు అన్నదానం, మజ్జిగ పంపిణీ
- భక్తులకు ప్రత్యేక ఆర్టీసీ బస్ సౌకర్యం
- పార్కింగ్ కి పకడ్బందీగా ఏర్పాటు
- పోలీసులతో భారీ బందోబస్తు
- ఆలయ కార్య నిర్వహణ అధికారి సుధాకర్





జమ్మికుంట, ఏప్రిల్15( ప్రజా జ్యోతి): ఇల్లందకుంట మండల కేంద్రంలో అపర భద్రాద్రిగా పేరొందిన శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఈ నెల17న బుధవారం జరగనున్న శ్రీ సీతారాముల కళ్యాణానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆలయ గోపురాలతో పాటు ప్రహరీ గోడ చుట్టు రంగులు వేయించి విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. గత సంవత్సరం సుమారు లక్ష వరకు భక్తులు కల్యాణ వేడుకకు హాజరుకాగా ఈసారి భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

### కళ్యాణానికి ఏర్పాట్లు పూర్తి

ఆలయానికి ఉత్తరం దిక్కున ఉన్న కల్యాణ మండపం, రేకుల షెడ్ల వద్ద అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కల్యాణ మండపానికి ఒకవైపు కళ్యాణ దాతలకు మరోవైపు వివిఐపీలు, డోనర్లకు కేటాయించగా రేకుల షెడ్లు కింద మీడియా, సాధారణ భక్తులకు కళ్యాణాన్ని వీక్షించేందుకు అవకాశం కల్పించారు. భక్తులు రాములోరి కల్యాణాన్ని వీక్షించేందుకు ఆలయ ఆవరణలో ఐదు ఎల్ఈడి ప్రొజెక్టర్లను సైతం ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా భారీ కేడ్లు, పెండిల్స్, ఎండ వేడిమిని తట్టుకునేందుకు చలువ పందిళ్లను ఆలయ ఆవరణలో ఏర్పాటు చేశారు. భక్తులకు తాగునీరు, వైద్యం, టాయిలెట్స్ లాంటి సదుపాయాలను కల్పించారు. భక్తులకు కోనేరు వద్ద జల్లు స్థానం ఏర్పాటుతో పాటు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేశారు.

### ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్న జిల్లా కలెక్టర్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనలను అనుసరించి ఈ సారి జరిగే శ్రీ సీతారాముల కల్యాణానికి జిల్లా కలెక్టర్ పమేల సత్పతి శ్రీ సీతారాములకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించనున్నారు.

### కళ్యాణానికి హాజరయ్యె భక్తులకు అన్నదానం, మజ్జిగ పంపిణీ

శ్రీ సీతారాముల కల్యాణానికి వచ్చే భక్తులలో సుమారు 60 వేల మందికి జమ్మికుంట కాటన్ మిల్లర్స్, పారా బాయిల్డ్ రైస్ మిల్లర్స్, రా రైస్ మిల్లర్స్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. గతంలో పలువురు దాతల చేయూతతో కళ్యాణానికి హాజరయ్యే భక్తులకు మజ్జిగ పంపిణీ చేయగా ఈసారి కూడా దాతలు ముందుకు వచ్చి మజ్జిగ పంపిణీ చేయనున్నారు.

### భక్తులకు ప్రత్యేక బస్ సౌకర్యం

శ్రీ సీతారాముల కల్యాణానికి హాజరయ్యే భక్తుల కోసం జమ్మికుంట నుండి ఇల్లందకుంట వరకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

### భారీ పోలీసు బందోబస్తు

అపర భద్రాద్రిగా పేరొందిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణానికి సుమారు లక్షకుపైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉండడంతో సిపి అభిషేక్ మహంతి సుమారు 300 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయా నికి వచ్చే సరిహద్దులలోనే ట్రాఫిక్ నియంత్రించే చర్యలు తీసుకుంటున్నారు. వాహనాల పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా తగు ఏర్పాటు చేపట్టారు..

### ఆలయంలో జరిగే ముఖ్య కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 17న బుధవారం శ్రీ సీతారాముల కల్యాణం, 18న గురువారం శ్రీ సీతారాముల పట్టాభిషేకం, 23న మంగళవారం సూర్య రథోత్సవం (చిన్న రథం) 24న బుధవారం రాత్రి చంద్ర రథోత్సవం ప్రారంభం( పెద్ద రథం), 25న గురువారం చంద్ర రథోత్సవం(పెద్ద రథం) ఊరేగింపు, 26న శుక్రవారం రాత్రి శ్రీ పుష్పయాగం (నాఖబలి).

### కళ్యాణానికి సర్వం సిద్ధం చేశాం

**కందుల సుధాకర్ ఆలయ కార్య నిర్వహణ అధికారి**

బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవాదాయ శాఖ కరీంనగర్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఏ.చంద్రశేఖర్ పర్యవేక్షణలో శ్రీ సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం చేశాం. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో శ్రీ సీతారాముల కల్యాణ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వ హించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో విఐపి పాసులను రద్దు చేయడం జరిగింది. కళ్యాణ మండపం ఆవరణలో ఐదు ఎల్ఈడి ప్రొజెక్టర్లను సైతం ఏర్పాటు చేసాం. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు చర్యలు చేపడుతున్నామని ఈవో సుధాకర్ వెల్లడించారు.

# అగ్ని ప్రమాదాల నివారణపై విస్తృతంగా అవగాహన

- ప్రజల ఆస్తులు,ప్రాణాలు కాపాడడం లో ఫైర్ సిబ్బంది సేవలు అద్భుతం.
- అగ్ని ప్రమాదాల సమాచారం అందించండి.
- జమ్మికుంట ఫైర్ స్టేషన్ అధికారి రాజయ్య



జమ్మికుంట, ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి): అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు తమకు సమాచారం అందించాలని సమాచారం అందిన వెంటనే ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుంటారని జమ్మికుంట ఫైర్ స్టేషన్ ఇన్చార్జి ఆఫీసర్ రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని గాంధీ చౌరస్తా రైల్వే స్టేషన్ సమీపంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంచారు. అనంతరం వారు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు ఎండాకాలంలో ఎక్కువగా జరుగుతాయని ప్రజలు అప్రమత్తతతో ఉండాలని వీలైనంతవరకు అగ్ని ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఎక్కడైనా అనుకోకుండా అగ్ని ప్రమాదం లేదా షార్ట్ సర్క్యూట్ ద్వారా మంటలు వ్యాపిస్తే వెంటనే స్థానిక ఫైర్ స్టేషన్కు సమాచారం అందించాలని వారు తెలిపారు. అనంతరం ప్రజలకు అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఏ విధంగా మంటలను ఆర్పి వేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సిహెచ్ రాజయ్య, లీడింగ్ ఫైర్ మెన్ బి శ్రీనివాస్, డి ఓ పి ప్రసాద్ రెడ్డి, ఫైర్ మెన్ లు నరేందర్ రెడ్డి, తబ్రీజ్, శ్రీనివాస్, హోంగార్డు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ**



సిరిసిల్ల టౌన్ ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి): సిరిసిల్ల పట్టణంలో మున్సిపల్ లో కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ పద్ధతిలో పారిశుద్ధ, ఇతర విభాగాలలో పనిచేస్తూ సేవలందిస్తున్న మున్సిపల్ సిబ్బందికి రావలసిన ఆరు నెలల పిఆర్సి ఏరియాస్ బకాయిలను వెంటనే చెల్లించాలని పిఎఫ్ ఇతర పెండింగ్ సమస్యలను వారం రోజుల వరకు పరిష్కరించాలని లేకుంటే పనులు బందు చేసి నిరవధిక సమ్మె చేస్తామని సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ లావణ్య కు సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడుతూ. సిరిసిల్ల మున్సిపల్ లో పనిచేస్తున్న కార్మికులకు సంబంధించి పిఆర్సి ఏరియర్స్ 6 నెలల బకాయిలు రావాల్సి ఉందని అదేవిధంగా పిఎఫ్ డబ్బులు కార్మికుల వ్యక్తిగత ఖాతాలలో జమ కావాల్సి ఉన్నదని సమస్యలను పరిష్కరించాలని ఎన్నోసార్లు పనులు బందు చేసిన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారే తప్ప సమస్యలను పరిష్కరించడం లేదని కమిషనర్లు , చైర్మన్లు మారుతున్నారే తప్ప కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని పన్నుల వసూళ్లలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిన సిరిసిల్ల మున్సిపల్ లో కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడంలో కూడా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని అన్నారు ఇప్పటికైనా కమిషనర్ మున్సిపల్ చైర్పర్సన్ పాలకవర్గం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి వారం రోజుల వరకు సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని లేకుంటే సమస్యలు పరిష్కరించే వరకు కార్మికులందరూ సమ్మె చేయడం జరుగుతుందని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కాసారపు శంకర్ , రాజయ్య, బాలయ్య, నరేష్ తదితరులు ఉన్నారు.



## కాంగ్రెస్ పాలనలో రైతులు అష్టకష్టాలపాలు

ముస్తాబాద్ ఏప్రిల్ 15(ప్రజాజ్యోతి) రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ రైతుబంధు అధ్యక్షులు కల్వకుంట్ల గోపాల్ రావు పత్రికా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూకాంగ్రెస్ పాలనలో రైతులు అష్ట కష్టాల పడుతున్నారని అన్నారు.రైతులు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ దేవుడెరుగు కనీసం మద్దతు ధర కూడా లభించడం లేదన్నారు.అసమర్థ కాంగ్రెస్ పాలనలో క్వింటాలుకు రూ. 700 వరకు నష్టపోతున్నది రైతన్నలని, ఐకెపి సెంటర్లలో కొత్త బార్దన్ ఉండగా పాత బర్దన్ వేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నరన్నారు. వెంటనే రైతులు పండిం చిన ధాన్యానికి 500 రూపాయల బోనస్ కనీస మద్దతు ధర ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోసెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి,పట్టణ అధ్యక్షులు ఎద్దండి నర్సింహారెడ్డి, యూత్ అధ్యక్షుడు శీలం స్వామి,బిఆర్ఎస్ పార్టీ నాయకులు తాళ్ల రాజు గుండవేని సతీష్ ,బిఆర్ఎస్వి మండల అధ్యక్షుడు నవాజ్,కంచం నర్సింలు,బిఆర్ఎస్వి యూత్ ప్రశాంత్, గుణశేఖర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన విద్యాసాగర్ గౌడ్



మెట్ పల్లి ప్రతినిధి ఏప్రిల్ 15 ( ప్రజా జ్యోతి) : మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న మెట్ పల్లి పట్టణ అధ్యక్షుడు గుండగాని విద్యసాగర్ గౌడ్ కు ఆయన కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా కాంగ్రెస్ పార్టీలో చేరిన గీత కార్మికులకు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గడ్డం వెంకటేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు మెట్ పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరు మహేందర్ రెడ్డి, నరేష్, కిషోర్, గుండా శ్రీకాంత్ రెడ్డి, పురుషోత్తం, నల్ల రమేష్, భూస రాజేశ్వర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## యువతికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సాయం

వేములవాడ, ఏప్రిల్ 15, (ప్రజాజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలో నిరుపేద కుటుంబంకు చెందిన ఎల్లా రాజయ్య-ఎంకమ్మల కుమార్తె ప్రమీల వివాహం నా కలం అక్షర సత్యం ఫేస్బుక్ సోషల్ మీడియా ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈ వివాహంకు చేయూత అందించాల్సిందిగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను కోరారు. సానుకూలంగా స్పందించిన ఆది శ్రీనివాస్ ప్రమీల వివాహ వేడుకల్లో పాల్గొని, నూతన వధువు వరులను ఆశీర్వదించారు. తన వంతుగా 10,000 అందించి, గొప్ప మనసును చాటుకున్నారు.



# ఎస్సీ స్టడీ సర్కిల్ ను సద్వినియోగం చేసుకోవాలి

**కలెక్టర్ అనురాగ్ జయంతి**
**సిరిసిల్ల ఎస్సీ స్టడీ సర్కిల్ పరిశీలన**





రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 15, (ప్రజాజ్యోతి): పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్సీ విద్యార్థులు ఎస్సీ స్టడీ సర్కిల్ ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి పిలుపునిచ్చారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ ను కలెక్టర్ అనురాగ్ జయంతి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్ లో విద్యార్థులకు కల్పించిన వసతి, భోజన సౌకర్యాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం స్టడీ సర్కిల్ లోని విద్యార్థులతో మాట్లాడారు. ఇంకా ఏమైనా సౌకర్యాలు అవసరం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్సీ విద్యార్థులు స్టడీ సర్కిల్ లోని సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పక్కా ప్రణాళికతో అభ్యసించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. సిరిసిల్ల ఎస్సీ స్టడీ సర్కిల్ లో మొత్తం 100 మంది అభ్యర్థులు ఉన్నారు. 55 మంది యువకులు, 45 మంది యువతులు ఉన్నారు. ఇక్కడ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ కోసం రూ. 2500, యువకులకు ప్రతి నెలా రూ. 100, యువతులకు ప్రతి నెలా రూ. 150 మైంటనేన్స్ కోసం ఇస్తామని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్ కుమార్ తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు స్టడీ సర్కిల్ లో సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ మొహమ్మద్ అజాం తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ ట్రాలీ దొంగలను పట్టుకున్న పోలీసులు

**డీఎస్పీ రఘు చందర్ ప్రెస్ మీట్**



మల్యాల, ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి) :మల్యాల మండలం రాజారాం గ్రామంలో 7 వ తేదీ ఆదివారం జరిగిన ట్రాక్టర్ ట్రాలీ దొంగతనం కేసులో సాంకేతిక పరిజ్ఞానంతో సోమవారం కొండగట్టులో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు నిందితులను పట్టుకొని డిఎస్పి రఘు చందర్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు.డీఎస్పీ రఘు చందర్ మాట్లాడుతూ వ్యవసాయం కూలి పని వల్ల వచ్చే డబ్బులు సరిపోక ఎక్కువ డబ్బులు సంపాదించాలని దురుద్దేశంతో నిందితులు దొంగతనానికి పాల్పడ్డారని తెలిపారు.మల్యాల మండలం రాజారం గ్రామానికి చెందిన గడ్డం చంద్రశేఖర్ రెడ్డి 7వ తేదీ ఏప్రిల్ ఆదివారం ఇంటి పక్కన పార్క్ చేసిన ట్రాక్టర్ ట్రాలీని రాత్రి దొంగిలించిన దొంగలు కొండగట్టు దాటిన తర్వాత గల గుట్టల వైపు చెట్ల పొదలు దాచి 15వ తేదీ సోమవారం కొండగట్టు నుండి ట్రాక్టర్ ను స్వగ్రామం తరలిస్తుండగా కొండగట్టులో వాహనాలు తలుఖీలు చేస్తున్న పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారని.నిందితులు ఎస్ చంద్రశేఖర్ రెడ్డి(27),గొర్రె మధుకర్ (24) పెంబి రాజు (23) మరియు మైనర్ ను పట్టుకొని నిందితుల వద్ద నుండి ట్రాక్టర్,ట్రాలీ వారు ఉపయోగించిన హెచ్ఎఫ్ డీలక్స్(టీఎస్ 21 టి 8238)వాహనము మూడు మొబైల్లు స్వాధీన పరుచుకున్నామని తెలిపారు. గతంలో నిందితులు ట్రాక్టర్ ను దొంగతనం చేయగా,గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయినది.అయినప్పటికీ మారకుండా అధిక ఆదాయం కోసం మళ్లీ దొంగతనం పాల్పడ్డారన్నారు. జిల్లా ఎస్పీ సంప్రీత్ సింగ్ ఆదేశాలతో నిందితులను పట్టుకునేందుకు సిఐ నీలం రవి ఆధ్వర్యంలో ఎస్సై అబ్దుల్ రహీం,కుమారస్వామిలు 2 టీములుగా ఏర్పడి ట్రాక్టర్ ట్రాలీ(సుమారు 8 లక్షల విలువగల) కేసును చేదించినందుకు ఎస్పీ సంప్రీత్ సింగ్ అభినందించారని డిఎస్పి రఘు చందర్ తెలిపారు.

# మైనారిటీ అభ్యర్థుల కోసం యూపీఎస్సీ-2025 ఉచిత కోచింగ్

**జిల్లా మైనారిటి సంక్షేమ అధికారి**
**ఆర్వి రాధా బాయి**

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 15, (ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ, హైదరాబాద్ వారు యూపీఎస్సీ-2025 సివిల్ సర్వీసెస్ పరీక్ష కోసం 2024-2025 విద్యా సంవత్సరంలో (100) మైనారిటీస్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ను నిర్వహిస్తోందని జిల్లా మైనారిటి సంక్షేమ అధికారి ఆర్వి రాధా బాయి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇట్టి శిక్షణకు రిజర్వేషన్ల నియమం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు, అన్ని రిజర్వ్డ్ కేటగిరీలలో వికలాంగులకు 05 శాతం సీట్ల కేటాయించడం జరుగుతుందని తెలిపారు. హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్ లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులందరూ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకొనవలెను మరియు ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుందని అన్నారు. తల్లితండ్రుల/సంరక్షకుల వార్షిక ఆదాయం సంవత్సరానికి రూ.5.00 లక్షలకు మించకూడదని, యుపిఎస్సి (సిఎస్ఎటి-2024) యొక్క సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ లో ప్రవేశం కోసం తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోని సాధారణ, ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీస్ అభ్యర్థుల ద్వారా మార్చి 15 నుండి ఆన్లైన్ సెట్.సీజీజీ.గావ్.ఇన్/టీఎంఆర్ఈఐఎస్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించబడతాయన్నారు. దరఖాస్తులు స్వీకరించడానికి ఏప్రిల్ 22 చివరి అవకాశమని తెలిపారు. ఏప్రిల్ 28న ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అన్ని జిల్లా కేంద్రములో గల తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో పరీక్ష నిర్వహించబడునని అన్నారు. అర్హులైన ఆసక్తి కలిగిన మైనారిటీస్ విద్యార్థులు ఇట్టి సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు నెంబర్ 040-23236112 అన్ని పని దినములలో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు సంప్రదించాలని పేర్కొన్నారు.

# సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా కోడూరి పరశురాం గౌడ్





ప్రజాజ్యోతి ,కరీంనగర్ బ్యూరో: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తారక హోటల్ లో నిర్వహించిన సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వ్యవస్థాపక అధ్యక్షులు వీరగోని పెంటయ్య ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడుతూ గత 12 సంవత్సరాల సంఘం ద్వారా జరిగిన పోరాట కార్యక్రమాలు సర్వాయి పాపన్న గుట్టల శ్రేణిని , గ్రానైట్ క్వారీల బారిన పడకుండా కాపాడిన పోరాటాలను తొలి వెలుగు ప్రజాస్వామిక విప్లవ వీరుడు సర్వాయి పాపన్న చరిత్రను ప్రజల్లోకి తీసుకు వెల్లిన విధానంపై వేదిక సమర్పించారు. అనంతరం సభ్య సమావేశంలో కోడూరి పరుశురాం గౌడ్ ని సర్వాయి పాపన్న గీతా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గీతా కార్మికుల ప్రమాదాల బారిన పడకుండా సేఫ్టీ మూకులను ప్రభుత్వం ద్వారా అందేలా చూస్తానని , ప్రమాదాలు జరిగినప్పుడు ఆస్పత్రి ఖర్చు లకు 50 వేల రూపాయల చొప్పున మరణించిన వ్యక్తులకు దహన సంస్కారాల కత్తి 25వేల రూపాయలు , సొసైటీ కి ఐదు ఎకరాల భూమితో పాటు సర్వాయి పాపన్న పేరు మీద భవనం నిర్మించడానికి ప్రభుత్వం ద్వారా మంజూరుకు కృషి చేస్తానని వారు తెలిపారు. అనంతరం సర్వాయి పాపన్న సభ్యులు శాలువాతో మరియు పూల బొకేతో అభినందించారు. ఈ సమావేశంలో సింగిం సత్తయ్య గౌడ్,కలర్ సత్తన్న గౌడ్ ,మల్లేశం గౌడ్ , బుచ్చమన్నాగౌడ్ , కర్ర్యాజ తిరుపతి గౌడ్ , రాజేశ్వర్ గౌడ్, సుధ గోని శ్రీనివాస్ గౌడ్ , శేఖర్ గౌడ్, తాళ్లపల్లి లింగన్న గౌడ్ పలు గీతా సంఘం నాయకులు పాల్గొన్నారు.



## రాష్ట్ర గవర్నర్ సి పి రాధాకృష్ణన్ ను కలిసిన ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

కాల్వ శ్రీరాంపూర్ ,( ప్రజా జ్యోతి), ఏప్రిల్ 15: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సి పి రాధాకృష్ణను హైదరాబాదులో ఎస్సీ ఎస్టీ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కట్కూరి మల్లేష్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సాయి రాజులు శనివారం రోజున కలిశారు

### సారంగాపూర్ మండల్
## బిఅర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశం



బీరుపూర్ (సారంగాపూర్), ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి): సారంగాపూర్ మండల కేంద్రంలో విలేజ్ కమ్యూనిటీ హాల్ లో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో సారంగాపూర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి నిజామాబాద్ పార్లమెంట్ బిఅర్ఎస్ ఎంపి అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ హాజరై కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు సురేష్ రెడ్డీ ఎన్నికల ఇంచార్జి లోక బాపురెడ్డి జడ్పీటిసి మనోహర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గుర్రాల రాజేందర్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జోగినపల్లి సుధాకర్ రావు, వైస్ ఎంపీపీ సోల్లు సురేందర్ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్ లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### సీతారాముల కల్యాణానికి
## వేములవాడ నుండి తలంబ్రాలు



జమ్మికుంట, ఏప్రిల్15( ప్రజా జ్యోతి): అపర భద్రాద్రి శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి వేములవాడ పుణ్యక్షేత్రానికి చెందిన శ్రీ రాజరాజేశ్వర దేవి సేవా సమితి సీతారామచంద్రస్వామి వారికి సారే చీర,తో పాటు గోటితో తీసిన తలంబ్రాలను, ముత్యాల తలంబ్రాలు,పూలు పండ్లు స్వచ్ఛందంగా తీసుకువచ్చి సమర్పించారని ఆలయ కార్యనిర్వాహణాధికారి కే సుదాకర్ తెలిపారు.. వీరితోపాటు గ్రామ మహిళా భక్తులు పరిసర ప్రాంత మహిళ భక్తులు తలంబ్రాలను అందించారని తెలిపారు.



# మున్నూరు కాపుల దినోత్సవంగా శ్రీరామనవమి

**రాష్ట్ర సెక్రటరీ జనరల్ హరి ఆశోక్ కుమార్.**

జగిత్యాల ప్రతినిధి ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి) :శ్రీరామ నవమి పండుగను మున్నూరు కాపుల దినోత్సవంగా జరుపుకోవాలని తెలంగాణ మున్నూరు కాపు సంఘం సెక్రెటరీ జనరల్ హరి ఆశోక్ కుమార్,మున్నూరు కాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరే దశరథం లు పిలుపునిచ్చారు.జిల్లా కేంద్రంలోని పటెండ్లవాడలో సోమవారం హరి నర్సయ్య పటేల్,పుప్పాల నారాయణ పటెండ్ల స్మారక భవన్ సమావేశ మందిరం లో వారు మున్నూరు కాపుల శుభ దినోత్సవం పౌరాణి క, చారిత్రక విశేషాలను సంఘాల ప్రతినిధులకు వివరించారు.తెలంగాణ రాష్ట్రంలోనే ఉన్న మున్నూరు కాపు సామాజిక వర్గం త్రేతాయుగం,ద్వాపర యుగాల నుంచి తమ కుల మూల పురుషుడు జనక మహారాజు కూతు రు అయిన సీతాదేవి కళ్యాణము రోజును మున్నూరు కాపుల దినోత్సవంగా జరుపుకున్నారనే విషయంలోపౌరాణిక, చారిత్రక ఆధారాలున్నాయని పేర్కొన్నారు.ఈ నెల 17 న శ్రీరామ నవమి రోజున మున్నూరు కాపు లకు విశిష్ట సేవలు అందించిన వారిని సంఘము తరపున ఘనంగా సన్మానించాలని సూచించారు. మున్నూరు కాపులను బీ సి ఏ గ్రూప్ లో చేర్చాలని బి సి.కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన రావు కు తగు కారణాలతో వినతిపత్రంసమర్పించామన్నారు.మున్నూరు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ,కృషి చేసిన ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం భద్రాచలం లో జరిగే సీతారాముల కళ్యాణముకు తమ రాష్ట్ర సంఘము తరపున స్వామి వారికి ముత్యాలతలంబ్రాలను,పట్టు వస్త్రాలను సమర్పిస్తామన్నారు.జై శ్రీరాం అంటూ శ్రీరామ



నామ స్మరణ చేశారు. కార్యక్రమంలో మున్నూరు కాపు యువజన సంక్షే మ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరే మ హేందర్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు పుప్పాల గంగాధర్, యువజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి విజయ్,ప్రధాన కార్యదర్శి క్యాస రఘునందన్ రెడ్డి,లీగల్ సెల్ అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ, యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుప్పాల నర్సింగరావు, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు పుప్పాల విజయ, ప్రధాన కార్యదర్శి గంగం జలజ,జిల్లా నాయకు లు తాడెపు రమణ పుప్పాల కిషోర్ కుమార్,రాపల్లి గంగన్న, లైసెట్టి వెంకటి,కొండెంగారి శ్రీదర్,పి.సి. హన్మంత్ రెడ్డి, వొజ్జలబుచ్చిరెడ్డి,సౌడాల కమలాకర్ , భూతం ఆనంద్ వొడ్నల జగన్ , నెల్ల రాజేశ్వర్ రెడ్డి, చిందం మనోహర్ పటేల్ , మారిశెట్టి ఆశోక్, దిండిగాల విట్టల్, వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఛిద్రమైన రోడ్లను పరిశీలించిన జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

మంథని, ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి) : మూడు ఓట్లు లేని కుటుంబం ఇంత పెద్ద సమాజానికి మాయమాటలు, అబద్దాలు చెప్పి అధికారం చెలాయిస్తోందని జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ ఆరోపించారు. గత ప్రభుత్వంలో నీళ్ల కింద ఇసుక వృధాగా పోవద్దని, కేసీఆర్ సర్కార్ ఇసుక తీసి ప్రజల అవసరాలకు వినియోగించడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు డబ్బులు జమ చేసిందని తెలిపారు. ఈనాడు మాత్రం ఇసుక క్వారీలు, లారీల డబ్బులు కాంగ్రెస్ నాయకుల జేబుల్లోకి వెళ్తున్నాయని, నియోజకవర్గంలో ఇసుక, బియ్యం, స్క్రాప్, బెల్లం దందాలకు కాంగ్రెస్ నాయకులు ఇంచార్జీలుగా వ్యవహరిస్తే మంత్రి సోదరుడు నాయకత్వం వహిస్తున్నాడని



ఆయన ఆరోపించారు. ఈ ప్రాంతంలో రౌడీయిజానికి దోపిడికి కాంగ్రెస్ నాయకులు బ్రాండ్ అంబాసిడర్లుగా నిలుస్తున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా తనపై చేసిన ఆరోపణలు రుజువు చేయడం లేదని, ఇసుక క్వారీలు, లారీలు ఆగడం లేదని, అధికారంలో ఉండి ఒక్క మంచి హోదాలో ఉండి కూడా ఇసుక రవాణాను ఎందుకు ఆపుతలేరని ఆయన ప్రశ్నించారు. ఇసుక రవాణాను ఆపాలని సుల్తానాబాద్‌లో అన్ని పార్టీలు నాయకులు దీక్ష చేస్తున్నారని, అదే తరహాలో మంథనిలో కాంగ్రెస్ నాయకులు దీక్ష చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# మామూళ్ల మత్తులో విచ్చల విడిగా మద్యం

- **వివిధ హోటల్స్,లాడ్జ లలో సిట్టింగ్**
- **నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు.**
- **పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు**
- **సామాజిక కార్యకర్త షేక్ సాబిర్ అలి**

జమ్మికుంట, ఏప్రిల్15( ప్రజా జ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ఎన్నికల సమయంలో మద్యం వ్యాపారులు అధికారుల తనిఖీలకు తావు లేకుండా విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడుతూ అమ్మకాలు చేస్తున్నారని సామాజిక కార్యకర్త...షేక్ సాబిర్ అలి ఆరోపించారు.. ఎన్నికల కోడ్ అమలులో కూడా ఎక్సైజ్ శాఖ అధికారులు వైన్ షాపులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, బిర్యానీ సెంటర్లు హోటల్ లాడ్జిలలో కూడా సిట్టింగ్ నడుస్తున్నప్పటికీ మామూల మత్తులో అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు...పట్టణంలోని వివిధ హోటల్స్, లాడ్జ లు మద్యం సిట్టింగ్ లకు కేరాఫ్ అడ్రస్ మారాయని అన్నారు..కావున ఇకనైనా అధికారులు స్పందించి రోజు వారి తనిఖీలను ముమ్మరం చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మద్యం దుకాణాల పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.




### రహదారిపై రాకపోకలకు
# అంతరాయం కలిగిస్తున్న వ్యక్తిపై సిఐ కి ఫిర్యాదు

మంథని ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి): ముత్తారం (మంథని) ప్రధాన రహదారి సీతంపేట బ్రిడ్జి వద్ద ఇసుక లారీలను ఆపి వారి వద్ద డబ్బులు అక్రమంగా వసూలు చేయడమే గాక సాధారణ ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న వ్యక్తిపై మంథని సీఐ కి తీర్థాల కొమురెల్లి సోమ వారం ఫిర్యాదు చేశాడు.వివరాలలోకి వెళితే సోమవారం మధ్యాహ్నం రోడ్డుకు లారీలు అడ్డంగా ఉండగా ఖమ్మం పల్లి గ్రామానికి చెందిన తీర్థాల కొమురెల్లి అటువైపు వెళ్ళాడు. అక్కడ గాజన వేన అరుణ్ అనే వార్డు సభ్యుడు ఇసుక లారీల వద్ద డబ్బులు వసూలు చేస్తూ కనిపించాడు. ఇదేమని అడిగితే నువ్వెవడు అంటూ బెదిరించాడు. అవసరమైతే నీ వద్ద కూడా వసూలు చేస్తానంటు బూతులు తిట్టి బెదిరించాడు. ఇసుక లారీల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడడమే కాక తనను అకారణంగా తిట్టిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని కొమరెల్లి ఫిర్యాదులో పేర్కొన్నాడు.







## ఆర్థిక సహాయం అందజేత

రుద్రంగి ఏప్రిల్ 15 ప్రజా జ్యోతి: రుద్రంగి మండల కేంద్రానికి చెందిన ఎల్లా రాజయ్య ఎంకమ్మ గార్ల కుమార్తె ప్రమీల వివాహం సోమవారం జరుగుతుందని తెలుసుకొని ప్రమీల వివాహానికి ఆర్థిక సహాయంతో పాటు పట్టు వస్త్రాలను వధూవరులకు ఎంపిపి గంగం స్వరూప మహేష్ అందజేశారు.ఈ సందర్భంగా నా కాలం అక్షరసత్యం టీం సభ్యుడు మర్రిపెల్లి విశాల్ మాట్లాడుతూ. ప్రమీల తల్లిదండ్రులు చిన్నప్పుడే అనారోగ్యంతో మరణించారని. ప్రమీల ది నిరుపేద కుటుంబం కావడంతో ప్రమీల పెళ్లి విషయాన్ని నా కలం అక్షర సత్యం వ్యవస్థాపకుడు కి తెలియజేయగా ప్రమీల విషయాన్నీ ఫేసుబుక్ లో పోస్ట్ చేయడంతో స్పందించిన ఎంపిపి గంగం స్వరూప మహేష్, దంపతులు ప్రమీల వివాహానికి 5000ల రూపాయల నగదు అలాగే పట్టు వస్త్రాలు అందజేయడం సంతోషకరమని అన్నారు.నిరుపేద యువతి వివహానికి అండగా నిలిచిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

### సీతారామచంద్రస్వామి కళ్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పన

జమ్మికుంట, ఏప్రిల్15( ప్రజా జ్యోతి): అపర భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవానికి జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం నుండి సోమవారం సాయంత్రం పట్టు వస్త్రాలు తలంబ్రాలను కొండగట్టు దేవస్థానం ఈవో ఏ చంద్రశేఖర్, కొండగట్టు అర్చకులు సమర్పించారని ఇల్లందకుంట ఆలయ కార్య నిర్వహణ అధికారి కే సుధాకర్ తెలిపారు.